కథానిక

# అక్షరాలా పంచశీల

ద్రోణంరాజు కృష్ణమోహన్

రాజ్యానికీ మధుకీ సంపూర్ణ అంగీకారం కుదిరింది ఒకరోజు గతం మరిచి పోవాలనుకున్నారు ఇక చీటికీ మాటికీ పోట్లాడుకోవడం, మూడు నెలల కొకసారి పుట్టింటికి వెళ్ళిపోవడం బాగుండదనీ అభిప్రాయపడ్డారు అయితే ఒప్పందం అంత తేలికగా కుదిరిందీ? —ఐదు షరతులు పెట్టుకున్నారు

1 ఉభయులు సమాన హక్కులు కలిగి వుండాలి ఒకరి స్వాతంత్ర్యాన్ని మరొకరు హరించే ప్రయత్నం చేయకూడదు

2 వంట పనుల్లోను, ఇంటి పనుల్లోను శ్రీమతికి సంపూర్ణ స్వేచ్ఛ బజారు పనులు, ఖర్చులు తేవడం, సంపాదన, వీటిల్లో మధుకి పూర్తిహక్కు

3 శ్రీమతి తన అన్నయ్య, నాన్న, యిచ్చే డబ్బులతో తన ఇష్టంవచ్చిన బట్టలు, పౌడర్లు, పత్రికలు కొనుక్కుంటుంది మధు అడ్డు చెప్పకూడదు

4 ప్రక్కింటి పిన్ని గారుగాని ఎదురింటి నరసమ్మగాని సినిమాకు, డ్యాన్సుకుపోతే రాజ్యంకూడా వెడుతుంది భర్తతో చెప్పనవసరం లేకుండా, అలాగే మధు కూడా

5 శ్రీమతికి ఒంట్లో బాగుండనప్పుడుగాని బుద్ధి కుదరనప్పుడుగాని వంట మానేస్తుంది మధు వెళ్ళి క్యారియరు మోసుకురావాలి

♦ ♦ ♦

ఒకరోజు మధు ఇంటి కొచ్చాడు ఏడయింది తలనొప్పిగా వున్నది కొంచెం పడిశెం, దగ్గుకూడా, బాధిస్తున్నాయి జ్వరం తగిలినట్లున్నది

"తాళం చెవి ఇదిగో బాబూ' ప్రక్కభాగంలో బామ్మగారిచ్చింది

"ఎక్కడికి వెళ్ళిందండీ?'' బాధగా అన్నాడు

"వైజయంతి డ్యాన్సుట వెళ్ళింది నరసమ్మతో మీరు తీసుకెళ్ళరని, మీకా ముచ్చటేవీ లేవని కళ్ళనీళ్లెట్టుకుంది పోనీలే వెళ్లు తల్లీ అన్నా'' చెప్పింది జరిగిన విషయం

ఆశ్చర్యపోయాడు మూడు రూపాయలకు తక్కువ టిక్కెట్టేలేదు .తలుపు తీసి లైటు వేశాడు కళ్లు మండుతున్నాయి నీరసంగా వున్నది చప్పన మజ్జిగ అన్నం ముద్దలు నాలుగు నోట్లో వేసుకుని పడుకుందామని వంట యింటి గొళ్ళెం తీశాడు లైటువేసి చూశాడు గిన్నెలు శుభ్రంగా తోమిపెట్టి వున్నాయి ఎక్కడా పొయ్యి రాజేసిన సూచన లేదు అర్థమైంది మంట లెత్తుకొచ్చినవి ఒక మూల జ్వరం, మరోమూల కోపం, ప్రజ్వరిల్లుతున్నాయి ఏడుపొచ్చింది

"ఛీ పాడు మనిషి, ఆడజన్మ పారపాటున ఎత్తింది బుద్ధి గడ్డితిని పెళ్ళి చేసుకున్నా'' గొణుక్కున్నాడు కళ్లు తుడుచుకుంటూ, చరచర ఇవతల కొచ్చాడు ఒళ్లు తూలుతోంది రాజ్యాన్ని రాగానే నాలుగు బాదేద్దామని అనుకున్నాడు కాని పంచశీల ఒప్పందం గుర్తుకొచ్చింది తన కర్తవ్యం కూడా జ్ఞాపకాని కొచ్చింది భంగం కలిగితే రాజ్యానికి ఎక్కడ కోపమొస్తుందోనని భయపడ్డాడు ఓపిక లేకపోయినా ఇల్లు తాళంపెట్టి బయలుదేరాడు, క్యారియరు పుచ్చుకుని.

అరగంట గడిచింది తిరిగి వచ్చాడు క్యారియరు గిన్నెలు తీసి అన్నం పెట్టుకునే ఓపిక లేకపోయింది అయినా తప్పలేదు కూర కలుపుకున్నాడు పాడువాసన గొట్టింది, రెండు ముద్దలు తినేసరికి పులుసు పోసుకుని కలుపుకుంటుండగా, చచ్చిన ఈగ కనిపించింది ... భళ్లున ఏడుపొచ్చింది .. చారు

త్రాగాడు, అది మాత్రం కొద్దిగా రుచించింది తరువాత ఒళ్లు చల్లబడుతుందని మజ్జిగ త్రాగాడు, దానినిండా కరివేపాకు, నిమ్మకాయ ఏనాటి మజ్జిగో!....తేనుపొచ్చింది అది వికారం క్రింద దింపింది. కడుపులో గుళ, గుళ, మన్నాయి.. .రెండు నిముషాలలో వాంతి చేసు కున్నాడు. అంతా వెళ్ళిపోయింది నీళ్ళందించే దిక్కులేదు. తల గట్టిగా పట్టుకున్నాడు లేచి వెళ్ళాడు. మంచంమీద పడుకున్నాడు ఎప్పుడు నిద్రపట్టిందో తెలియదు

♦ ♦ ♦

"ఏంవండీ నిద్రపోతున్నారా?" ప్రక్కన నుంచుని అడిగింది

"...... ...." జవాబులేదు

"మిమ్మల్నే....వంటయిల్లంతా అలా వున్న దేం?" ప్రక్కలో కూర్చుంటూ నుదుటిమీద చెయ్యివేసి అడిగింది మెళుకువ వచ్చింది మధుకి. కళ్లు తెరిచాడు ప్రక్కకి ఒత్తిగిలి చూశాడు

"ఒంట్లో బాగుండలేదా?" భయపడుతూ అడిగింది రాజ్యం.

"లే........లేదు" నీరసంగా మూల్గుతూ అన్నాడు.

"జ్వరం తగిలినట్లున్నదే" పొట్టమీద చెయ్యివేసి చూసింది

"నువ్వు అన్నం తిను. ప్రొద్దుపోయింది" మళ్ళీ అటు తిరిగాడు

పోటులా తగిలింది బాణంలా గ్రుచ్చు కున్నది. రాజ్యానికి కళ్లనీళ్ళొచ్చాయి

"పాపిష్టి. దా . న్ని" అతనిమీద వాలింది వెక్కివెక్కి ఏడుస్తూ.

"చప్పన అన్నంతిను రాజ్యం" లేవదీస్తూ అన్నాడు అతని ముఖంలో ఏమాత్రం కోపం. బాధ, గోచరించలేదు

"నన్ను క్షమించండి మీ కాళ్లు పట్టు కుంటాను పొరపాటయింది. టిక్కెట్టు దొరక దేమోనని పెందరాళే వెళ్ళాను" అతని కాళ్ళ మీద ముఖం ఆన్చి, కన్నీరుజారుస్తూ అన్నది అతని పాదాలు తడిశాయి

"నాకు కోపం ఏమీలేదు రాజ్యం. నిజం. నమ్మవూ? నువ్వేం పొరపాటు చేశావని? మనం చేసుకున్న ఒప్పందానికి భిన్నంగా ఏమీ చేయలేదుగా"

ఎంత వ్యంగ్యం! భరించలేకపోయింది. ఇక అక్కడ వుండలేకపోయింది చేతులతో మొహం కప్పుకొని, ఏడుస్తూ పరుగెత్తింది రాజ్యం చాలా పెంకిపిల్ల అనీ, ఒళ్లు తెలియని ఆవేశంతో-బాధతో-ఎంతకయినా తెగిస్తుందనీ తెలును

"ఏంవిటది?" చీరె కొంగు పుచ్చుకుని ఆపాడు వెనక్కిలాగి, నుయ్యి ఇక రెండుగజాల దూరం వున్నదనగా

"ఒదలండి నేను మిమ్మల్ని అన్నివిధాల బాధపెడుతున్నాను. స్వార్థపరురాలని" అతని వంక చూడకుండా తలవంచుకుని అన్నది, చెయ్యి విదిలించుకోబోతూ

"ఏంవిటీపిచ్చి రాజ్యం! ఇంతమాత్రానికే ఇంత ఆవేశమొస్తే ఎలాచెప్పు? జ్వరంతో నేను బాధపడుతూంటే నువ్వు నూతిలోకిపోతావా?" ఆమెను కావిలించుకుని నుదుటిపై ముద్దు పెట్టుకుంటూ అన్నాడు అమాంతం చల్ల బడింది రాజ్యం. ఎక్కడికోవం, బాధ, యిట్టే ఎగిరిపోయాయి—భర్త లాలనగా దగ్గరకు తీసు కునేసరికి

"పిచ్చిదానా....ఒట్టి పిచ్చిపిల్లవి. అల్లరి పిల్లవి" జుట్టు సర్దుతూ పువ్వులు వాసన చూస్తూ అన్నాడు. ఆమె కంటివెంట జొటజొట నీరు ప్రవహించింది

"క్షమించండి ఎప్పుడూ చెయ్యను" క్రిందకువాలి పాదాలు పట్టుకుంది

"ఛీ"

"ఊహుఁ... అంటేగాని"

"అలాగే క్షమించాలే. వద అన్నంతిందువు గాని ముద్దలు కలిపి నోట్లోపెడతాను" ఎత్తుకు తీసుకెళ్ళబోయాడు బామ్మగారు రావడంచూసి సిగ్గుపడి చర్మని అతని చేతుల్లోంచి జారి పరుగెత్తింది రాజ్యం... . ★